క్లుప్తంగా

న్యాయవాద పరిషత్ జిల్లా కమిటీ ఎన్నిక





కామారెడ్డి టౌన్/భిక్కనూరు: జిల్లా న్యాయవాద పరిషత్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ శర్మ, కోశాధికారిగా గంగరాజు, ఉపాధ్యక్షుడిగా సందీప్‌రెడ్డి, మనోజ్ రాథోడ్, కార్యదర్శిగా భార్గవ్‌చంద్ర, యాదగిరిలను ఎన్నుకున్నారు. న్యాయవాదుల సంక్షేమం, ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించడం కోసం న్యాయవాద పరిషత్ కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

దివ్యాంగులు బస్‌పాస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బీబీపేట: మండలంలోని దివ్యాంగులు, ఆర్టీసీ బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు కుర్ల లింగం అన్నారు. సోమవారం దుబ్బాక ఆర్టీసీ డిపో సిబ్బంది చంద్రమౌళి, బస్‌పాస్ దరఖాస్తులు స్వీకరించారు. దివ్యాంగులకు 50 శాతం రాయితీతో ఇచ్చే పాస్‌లతో ప్రయాణించి సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ఉద్యోగమేళాకు భారీ స్పందన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ అకాడమీ స్కిల్స్ నాలెడ్జ్(టాస్క్), ప్రముఖ కంపెనీ హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు భారీ స్పందన లభించింది. సుమారు 300లకు పైగా అభ్యర్థులు హాజరు కాగా వారికి కంపెనీ ప్రతినిధులు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించారు. 73 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇలాంటి జాబ్‌మేళాలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో స్థిరపడాలని కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, టాస్క్ రిలేషన్ ఆఫీసర్ శ్రీనాథ్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంఐలు సకాలంలో చెల్లించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీలకు సంబంధించి ట్రాక్టర్ల ఈఎంఐలను సకాలంలో చెల్లించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోపు గ్రామాల్లో వందశాతం పన్నును వసూలు చేయాలన్నారు. దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు.

అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువుకు తైబంది



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువుకు సోమవారం తైబంది నిర్వహించారు. 1015 ఎకరాలకు నీటిని అందించేందుకు ఆయకట్టు రైతులు నిర్ణయించారు. అడ్లూర్ ఎల్లారెడ్డికి 800 ఎకరాలు, రంగంపేట్‌కు 25 ఎకరాలు, పోసానిపేట్‌కు వంద ఎకరాలు, అడ్లూర్‌కు 50 ఎకరాలు, టేక్రియాల్‌కు 20 ఎకరాలకు, ఇస్రోడివాడికి 20 ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో పైడి జనార్దన్, సంకరి రాజలింగం, బొలిపెల్లి మహేందర్ రెడ్డి, ఆకుల సిద్ధిరాములు, ఎడ్ల నర్సింలు, శివదినం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా సీసీ కెమెరాలు

- గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఈ నెల చివరన ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించడానికి సన్నాహాలు

దోమకొండ : గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో దోమకొండ మండల కేంద్రంలో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ సీసీ కెమెరాలు బిగించినా అవి పని చేయడం లేదు. దీంతో నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై ఆంజనేయులు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామానికి చెందిన పలువురు కుల పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. వారి సహకారంతో వాటిని ఏర్పాటు చేయాలని అనుకున్నారు. కాని ఆ పెద్దలంతా దీని కోసం గడికోట ట్రస్టు వారి సహకారం తీసుకోవాలని సూచించారు. దీంతో విషయాన్ని గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి గడికోట వారసులైన కామినేని అనిల్‌కుమార్‌తో మాట్లాడారు. సీసీ కెమెరాలకు ఎంత ఖర్చవుతుందో ఎస్టిమేషన్ వేయించిన ఆయన వాటిని గ్రామంలో పోలీసులు సూచించిన పలు ప్రదేశాల్లో కెమెరాలు బిగించాలని సూచించారు. 32 చోట్ల సీసీ కెమెరాలు బిగించారు. వీటిని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చాంబర్‌లో పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు. గ్రామంలోని ముత్యంపేట మూలమలుపు, సబ్‌స్టేషన్ ఏరియా, బస్టాండ్, చాముండేశ్వరి ఆలయం, బీబీపేట రోడ్డు, వైన్స్ షాపుల వద్ద, పెద్దమల్లారెడ్డి మూలమలుపు వద్ద, సుభాష్‌రోడ్డు, బురుజు ఏరియా, పెద్ద హన్మండ్ల మూలమలపు తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. దొంగతనాలు జరిగినా గ్రామంలో ఏ మూల నుంచి ఊరి విడిచివెళ్లినా వారిని పట్టుకునే విధంగా వీటిని ఏర్పాటు చేశారు. ఈ నెల చివరన జిల్లా ఎస్పీ సింధు శర్మ చేతుల మీదుగా వీటిని ప్రారంభించడానికి ఏర్పాటు చేశారు.



దోమకొండలోని ప్రధాన వీధుల్లో బిగించిన సీసీ కెమెరాలు



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల మానిటర్

అన్ని వైపులా ఏర్పాటు చేశాం



మండల కేంద్రంలో 32 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం అవి పనిచేస్తున్నాయి. వాటిని పోలీస్ స్టేషన్ నుంచి మానిటరింగ్ చేస్తున్నాం. గ్రామంలోని అన్ని ప్రాంతాలు కవర్ అయ్యేలా ఊరికి నాలుగు వైపులా వీటిని బిగించారు. దీని వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. వీటిని జిల్లా ఎస్పీ సింధు శర్మ చేతుల మీదుగా ఈనెల చివరన ప్రారంభించేలా చూస్తున్నాం.

– ఆంజనేయులు, ఎస్సై, దోమకొండ

పంట పొలాలకు పోయేదెట్లా?



కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

రాజంపేట: తమ పంట పొలాలకు వెళ్లే దారిని ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులు మూసేశారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజావాణిలో భాగంగా తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పంట పొలాలకు వెళ్లకుండా అడ్డుగా కడీలు, పలకలు అడ్డుగా పెట్టారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ లక్ష్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రస్తుతం వెంచర్ నిర్వాహకులకు రెవెన్యూ, గ్రామ పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. రైతులు ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు సైతం వినతి పత్రం అందజేశారు.

మహా యజ్ఞంతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: ఇప్పటికైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని యజ్ఞం చేసినట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో వేద పండితులు, మంత్రోచ్ఛరణాలతో మహా యజ్ఞం నిర్వహించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. తక్షణమే తమను క్రమబద్ధీకరణ చేసి అప్పటి వరకు పేస్కేల్‌ను అమలు చేయాలన్నారు. న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని అప్పటి వరకు సమ్మె ఆపేదిలేదని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీపీఎం సుధాకర్

రాజంపేట: మహిళా సంఘ సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ డీపీఎం సుధాకర్ అన్నారు. సోమవారం మండల సమాఖ్యలో నిర్వహించిన ఈసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన సభ్యులను సంఘంలో చేర్పించుట, పుస్తకాల అంతర్గత తనిఖీ గురించి సంఘ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో అధ్యక్షులు సుతారి లక్ష్మి, ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, సాయిలు, భాగయ్య, స్వామి, అకౌంటెంట్ ప్రశాంతి పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడానికే షీటీంలు



అవగాహన కల్పిస్తున్న షీటీం బృంద సభ్యులు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు షీటీంలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షీటీం కళా బృంద సభ్యులు మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ కళాశాలల్లో షీటీంలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతోనే షీటీంలను ఏర్పాటు చేశారని తెలిపారు. మహిళలకు ఎటువంటి సమస్య వచ్చినా 100కు ఫోన్ చేయాలని సూచించారు. అదేవిధంగా సైబర్ క్రైమ్, రోడ్ భద్రతపై అవగాహన కల్పించారు. బాన్సువాడ షీటీం కానిస్టేబుల్ అనిల్, ప్రియాంక, కామారెడ్డి పోలీసు కళాబృందం సభ్యులు ప్రభాకర్, సాయిలు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో యోసెఫ్ మాట్లాడుతూ.. వస్తువులు కొనేటప్పుడు ప్రతి ఒక్కరు వారి హక్కులను తెలుసుకోవాలన్నారు. పోటీల్లో డి.సృజన్ ప్రథమ బహుమతి, సంశిత ద్వితీయ బహుమతి, రాహుల్ తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. ఉపాధ్యాయులు కృష్ణాకర్‌రావు, నరేందర్, జైపాల్‌రెడ్డి, జాస్మిన్, చిన్నయ్య, రాజు, అన్వర్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన కురుమ కృష్ణమూర్తి పిడుగుపాటుకు మృతి చెందగా బాధిత కుటుంబానికి సోమవారం ప్రమాద బీమా కింద రూ.2 లక్షల చెక్కును బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల దుర్గారెడ్డి అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బరువు తక్కువ ఉన్న పిల్లలపై దృష్టి సారించాలి



అవగాహన కల్పిస్తున్న బ్లాక్ కో–ఆర్డినేటర్ ప్రసాద్

నిజాంసాగర్(జుక్కల్): బరువు తక్కువ ఉన్న పిల్లలపై అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు ప్రత్యేక దృష్టి సారించాలని బాన్సువాడ ఐసీడీఎస్ బ్లాక్ కో–ఆర్డినేటర్ ప్రసాద్ సూచించారు. సోమవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించారు. చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి టీచర్లకు సూచనలు చేశారు. మహమ్మద్‌నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడి టీచర్లు సంగమణి, రమ, సరస్వతి, కమల తదితరులున్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



లింగంపేట బాలికల పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, క్విజ్, గణితానికి సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు విద్యార్థుల అద్భుత ప్రతిభను వెలుగులోకి తెచ్చాయి. ఈ వేడుకలలో ప్రధానోపాధ్యాయురాలు గీత గణితశాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సింలు, చంద్రశేఖర్, నర్సింలు, సదాశివుడు, నరసింహారావు, మహేశ్వర్ గౌడ్, సవిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైన తాడ్వాయి శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితంపై క్విజ్‌పోటీలు, వ్యాసరచన, రంగోళి,ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించారు. అలాగే గణిత మాడ్యుల్స్ ప్రదర్శన నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



దోమకొండ: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో దోమకొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ చైతన్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా కమ్మదనంలో ఈనెల 19 నుంచి 21 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు విజేతలుగా నిలిచినట్లు ఆమె తెలిపారు. పాఠశాలకు చెందిన భార్గవి, మానసలు ఉత్తమ ప్రతిభ కనబర్చగా ఈ మేరకు వారికి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సోమవారం సన్మానించామన్నారు. ఉపాధ్యాయులు శ్రీలత, రమ్య పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. పాఠశాల ప్రిన్సిపల్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవునిపల్లి మల్లికార్జునస్వామి కల్యాణం



కామారెడ్డి రూరల్: దేవునిపల్లిలో మల్లన్న, గొల్ల కేతమ్మ, మేడాలమ్మల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అగ్ని గుండాలల్లో నడిచారు. గుడిమెట్‌కు చెందిన మహాదేవ్, మల్లికార్జునస్వామి భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. అనంతరం భక్తులు కట్న కానుకలను సమర్పించారు.

నేడు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రాక

మల్లన్న ఉత్సవాలకు మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ రానున్నట్లు వీడీసీ అధ్యక్షుడు గూడెల్లి గంగారాం తెలిపారు.

ఆధ్యాత్మికం..

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఆవరణలో గల షిరిడీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు. ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మాల కొండయ్య, పర్సనల్ మేనేజర్ వెంకటేశ్వర్ రావు, కార్మికులు పాల్గొన్నారు.

కాలభైరవ, వీరాంజనేయ స్వామి ఆలయం..



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని గుమాస్తాకాలనీలోని శ్రీకాలభైరవ వీరాంజనేయస్వామి ఆలయ 36 వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి ప్రవచనాలు చేశారు.

ఇసన్నపల్లి కాలభైరవ ఆలయంలో హోమం



రామారెడ్డి: ఇసన్నపల్లి శ్రీకాలభైరవుడి ఆలయంలో సోమవారం మార్గశిర బహుళ అష్టమి సందర్భంగా భైరవ హోమం నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు. కాలభైరవ స్వామి భక్తుడు మాచర్ల ప్రకాష్ (నర్సాపురం)కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి 3 కిలోల వెండి కపాల మాలను బహుకరించారు. ఈవో ప్రభు గుప్తా, అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణశర్మ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు ఎల్లారెడ్డిలో క్రిస్మస్ వేడుకలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ కన్వెన్షన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేందర్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం తరపున నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి హాజరుకానున్నట్లు వారు తెలిపారు. పట్టణంలోని జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే కార్యక్రమానికి రెవెన్యూ ఉద్యోగులు హాజరు కావాలని వారు కోరారు.

28న ఇసుక వేలం పాట

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ తహసీల్ కార్యాలయంలో ఈ నెల 28న ఇసుక కుప్పల వేలంపాట నిర్వహించనున్నట్లు సోమవారం తహసీల్దార్ రేణుకా చౌహాన్ తెలిపారు. మూడు రోజుల క్రితం మండలంలోని సిర్‌పూర్, పెద్ద టాక్లీ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా డంప్ చేసిన 15 నుంచి 20 ఇసుక ట్రాక్టర్‌ల కుప్పలను సీజ్ చేసినట్లు ఆమె చెప్పారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: రాష్ట్ర వారాల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్లను సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాజుల రాజులు మాట్లాడుతూ.. వారాల కులస్తులను ఓబీసీలో చేర్చేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వారాల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాములు, భిక్షపతి, గాజుల కృష్ణ, వెంకన్న, ప్రసాద్, నర్సింలు, వెంకటేశ్వర్లు, సుభాష్ ఉన్నారు.

నూతన కార్యవర్గం..

కామారెడ్డి మండల మున్నూరుకాపు సంఘం..



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమిరెడ్డి పెద్ద నారాయణ, ఉపాధ్యక్షులుగా ఉప్పులపు నవీన్, మామిండ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నీలం వెంకటి, జాయింట్ సెక్రెటరీలుగా ముదాం పెంటయ్య, కూర బాలరాజు, కోశాధికారిగా బత్తుల రవి ఎన్నికయ్యారు. కామారెడ్డి మండల మున్నూరుకాపు కో–ఆర్డినేటర్‌గా గడ్డమీది నరేష్ ఎన్నికయ్యారు.

సంక్షిప్తం

ప్రైవేటు పాఠశాలపై ఫిర్యాదు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పెద్దగుల్ల గ్రామంలోని వేదవాహిని పాఠశాల నిర్వహణపై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఎఫ్ఐ నాయకుడు అజయ్ కుమార్ తెలిపారు. గృహ నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని ఆ భవనంలో పాఠశాల కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్నూరుకాపు యూత్ అధ్యక్షుడిగా గోవర్ధన్

కామారెడ్డి రూరల్: మండల మున్నూరుకాపు యూత్ కార్యవర్గాన్ని సోమవారం జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానకుంట గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల మారుతి, ఉపాధ్యక్షులుగా పెద్ద పోతన్నగారి రాజేష్, బాణాల సురేష్, కోశాధికారిగా రావుల నడిపి గంగాధర్, కార్యదర్శులుగా లక్కాకుల లక్ష్మణ్, తోట సాయిలు, కార్యవర్గ సభ్యులుగా ముదాం మహేష్, కాసర్ల భూమిడి బొందయ్య, సంగిశెట్టి నరేష్, బచ్చగారి భాస్కర్‌లు ఎన్నికయ్యారు.

ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో పోలీసులు సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లు చెల్లించాలని పలువురు వాహనదారులకు సూచించారు. ఏఎస్సై సిద్ధిఖీ తదితరులున్నారు.

బూత్ కమిటీల ఎన్నిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): కన్‌కల్‌లో సోమవారం బూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి తెలిపారు. 141, 142 బూత్ కమిటీల అధ్యక్షులుగా పులుగం వెంకట్‌రెడ్డి, మర్రి రనీల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఇస్సానగర్‌లో..

బీబీపేట: ఇస్సానగర్‌లో సోమవారం బీజేపీ బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. 70వ బూత్ అధ్యక్షుడిగా మెరువుల భానుచందర్ రెడ్డి, 71వ బూత్ అధ్యక్షుడిగా అల్లం సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, నక్క రాజు, అల్లం ప్రవీణ్, దేవరాజు, శివ, సంతోష్, రవీందర్, శంకర్, వంశీ, నర్సింలు పాల్గొన్నారు.

ఎర్రాపహాడ్ పీహెచ్‌సీలో అమ్మఒడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ పీహెచ్‌సీలో సోమవారం అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి అర్జుమన్ నజీర మాట్లాడారు. హెచ్ఈవో నారాయణ, సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): అబ్దుల్లానగర్ శివారులోని పైడి ఎల్లారెడ్డి అతిథి గృహంలో ఈ నెల 29న జరిగే ఆర్యవైశ్య బంధుమిత్ర ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గంగాశరణ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. కిశోర్, రాజు, చంద్రశేఖర్, భాస్కర్, రాములు పాల్గొన్నారు.

'మాదిగల గుండె చప్పుడు'ను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి : మాదిగల గుండె చప్పుడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు మంథని సామ్యేల్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంఆర్‌పీఎస్ వర్గీకరణను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న హైద్రాబాద్‌లో నిర్వహించే మాదిగల గుండె చప్పుడు, లక్ష డప్పుల కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. నాయకులు పద్మారావు, శివానంద, సాయి తదితరులున్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి హాజరుకావాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయాధికారి అనిల్ కుమార్ సూచించారు. యాసంగిలో సాగు చేసే పంటలకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.